జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ మంగళవారం 1 సెప్టెంబర్ 2026 సంపుటి : 16 సంచిక : 212 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967

# కాసుల కోసం కక్కుర్తి



## కమీషన్ల కోసం రెఫరల్ దందా
## చెప్పిన దవాఖానకు వెళ్లకపోతే ప్రథమ చికిత్స బంద్
## పట్టించుకోని వైద్యారోగ్యశాఖ
## జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీల ఆగడాలు



**నిజామాబాద్ ప్రతినిధి, ప్రజాజ్యోతి ఆగస్టు 31 :**
నిజామాబాద్ జిల్లాలో ఆర్ఎంపీ,పీఎంపీల ధనదాహం తారాస్థాయికి చేరుతున్నది. తెలిసీ తెలియని పరిజ్ఞానంతో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు హద్దుదాటి వైద్యం చేస్తుండడంతో అమాయకులు బలవుతున్నారు. నిబంధనల మేరకు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్ లో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. సూది మందు, సెలైన్లు ఎక్కించకూడదు. కానీ అడిగేవారు " లేకపోవడంతో ఏకంగా అత్యవసర కేసులను సైతం చూస్తామని ఏకంగా బోర్డులే పెట్టేస్తున్నారు. కేవలం ఫస్ట్ ఎయిడ్ సెంటర్ గా పేరు ఉండాలని ఐఎంఏ నిబంధనలు విధించింది. గ్రామీణ ప్రాంతాలలో ప్రధానంగా అత్యవసరంగా ప్రాథమిక వైద్యం అందించేవారు వైద్య విద్యను అభ్యసించకుండా వైద్యం చేస్తే పేరు ముందు డాక్టర్ అనే ట్యాగ్ ఉండకుడదు అనే నిబంధనలు ఉన్నాయి. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ టీంల తనిఖీలలో పిఎంపీల, ఆర్ ఎంపిల వైద్యంపై కేసులు నమోదు అవుతున్న లెక్క చేయడం లేదు.. పేరుకు గ్రామీణ వైద్యులుగా చలమాణి అవుతున్న తాము ఫస్ట్ ఎయిడ్ సేవలను అందించే చోట ( క్లినిక్) లోనే మందుల దుకాణాలు, ల్యాబ్ లను నిర్వహిస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ఎకంగా అలోపతి వైద్యంలో కిలకమైన యాంటి బయాటిక్స్ ను ప్రిస్క్రిప్షన్ లపై రాసి రోగులకు అంటగడుతున్నారు.. చాలా ప్రాంతాల్లో ఏకంగా పడకలను సైతం ఏర్పాటు చేసుకొని సెలైన్లు ఎక్కిస్తున్నారు. ప్రథమ చికిత్సను మరిచి సొంతంగా మందులు రాసివ్వడం, - మిగతా2లో



# హామీలు ఘనం.. పించన్ల మంజూరు శూన్యం!

**పింఛన్లపై సర్కారుకు ప్రజావాణి సెగ!**

**ఎడపల్లిలో 168 మంది బీడీ పింఛన్‌దారుల ఆవేదన..**

**ప్రజావాణిలో వినతి.**

**అర్హులైన వారిని ఇంకా ఎందుకు పట్టించుకోరు?**



**ఎడపల్లి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**
అర్హులైన పింఛన్‌దారులకు పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బిఆర్ఎస్, బీజేపీ నాయకులు మండిపడ్డారు. పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు కందగట్ల రాంచందర్, బిఆర్ఎస్ నాయకుడు దుబ్బాక రవీందర్ గౌడ్ లు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సమగ్ర సర్వేలో ఎడపల్లి గ్రామంలో 168 మంది బీడీ జీవనాధార పింఛన్‌దారులను గుర్తించి ఎనిమిది నెలల పాటు పింఛన్లు అందించారని తెలిపారు. అయితే ఆ తర్వాత అకస్మాత్తుగా పింఛన్లను నిలిపివేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. - మిగతా2లో

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి ప్రధాన లక్ష్యం



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని సత్వరమే పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 67 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి - మిగతా2లో

# బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ కావాలి

**ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తేవాలన్న సంకల్పంతో ముందుకు వచ్చా**

**ఏ తప్పు చేయకుండానే జైల్లో పెట్టారు.. అప్పుడే నేను ఏ తప్పు చేయలేదని చెప్పా**

**అమ్మ ఇంటివాళ్లు నిర్దాక్షణ్యంగా తరిమేస్తే అత్తింటి వాళ్లు కన్న బిడ్డలా అక్కున చేర్చుకున్నారు**

**తండ్రి,?కూతురును పాపిన బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను.. నా ఉసురు తగులుతుంది**

**ఓ వైపు కాంగ్రెస్ పై పోరాటం చేస్తూనే టీఆర్ఎస్ నిర్మాణం చేస్తాం**

**వచ్చే ఎంపీటీసీ,?జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 31 ప్రజాజ్యోతి,**
తెలంగాణకు ఇప్పుడు కావాల్సింది బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సిన అవసరముందని ఆమె అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో - మిగతా2లో



# కలెక్టరేట్ కార్యాలయంలో ఉచిత నేత్ర పరీక్షల క్యాంప్



**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కామారెడ్డి**

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)**
జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉచిత నేత్ర పరీక్షల క్యాంప్, అవగాహన సదస్సు మరియు ప్రతిజ్ఞ ప్రచారం తెలంగాణా ప్రభుత్వ ఆదేశాల మేరకు కంటి దానంపై ప్రజల్లో అవగాహన పెంచడం, స్వచ్ఛంద నేత్రదాన ప్రతిజ్ఞలను ప్రోత్సహించడం మరియు కార్నియల్ దానానికి సంబంధించిన అపోహలను, మూఢనమ్మకాలను తొలగించే లక్ష్యంతో 25 ఆగస్టు నుండి 8 సెప్టెంబర్ 2026 వరకు తెలంగాణ వ్యాప్తంగా 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు . ఈ కార్యక్రమం లో భాగంగా ఈ రోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ , కామారెడ్డీ అధ్వర్యం లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. సమాజంలో - మిగతా2లో

# గ్రామ కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

**నవీపేట్: (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సాధారణ సమావేశం ఏర్పాటు చేయడంపై నిర్లక్ష్యం వహించగా అతనిపై ఉన్నత అధికారులు శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని 5వ వార్డు సభ్యులు చల్లా రవీందర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు సాధారణ సమావేశం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**







**నిజామాబాద్ ప్రతినిధి, ప్రజాజోతి ఆగస్టు 31 :** రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే టీఆర్ఎస్ లక్ష్యం:

**ఇందల్వాయిలో పార్టీ జెండాలు ఆవిష్కరణ.. పాత కలెక్టరేట్ గ్రౌండ్ సభకు భారీగా తరలిన ప్రజలు**





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 31** ఇందల్వాయి: మండల కేంద్రంలోని గన్నారం కమాన్ వద్ద టీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కవిత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ పేదల కోసం స్థాపించబడిందని అన్నారు. భూమి లేకుండా, నిరుపేదలుగా ఉన్న పేద కుటుంబాలకు ఎకరం భూమి అందించేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. తాను ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని కవిత పేర్కొన్నారు. ప్రజలే తనకు అండ అని, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సభకు ప్రజలు భారీగా తరలివచ్చి తనను ఆశీర్వదించాలని, తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కవిత కోరారు. పేదల సమస్యలను పరిష్కరించేందుకు తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కవిత ప్రసంగంతో సభా ప్రాంగణంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఇందల్వాయి నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు సభకు తరలివెళ్లారు. కాగా, నిజామాబాద్ పాత కలెక్టరేట్ గ్రౌండ్స్‌లో ఆగస్టు 31న కవిత ఆధ్వర్యంలో సభ నిర్వహించనున్నట్లు ముందుగానే పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాం నాయక్ రూరల్ ఇంచార్జ్ నరేష్ నాయక్. మోపాల్ మాజీ జెడ్పిటిసి. దేవి నాయక్. భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు



# సాగునీటి విడుదలకై ఎమ్మెల్యే భూపతి రెడ్డికి రైతుల వినతి

**సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. హర్షం వ్యక్తం చేసిన రైతులు**

**సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే**



**నిజామాబాదు రురల్, ప్రజా జ్యోతి 31** నిజామాబాద్ రూరల్ లో వరి పంట పొట్టదశలో ఉన్న నేపథ్యంలో పంటకు సాగునీరు అందించెలా కృషి చేయాలని కోరుతూ.. డిచ్ పల్లి మండలం ధర్మారం, మెంట్రాజ్ పల్లి బర్ధీపూర్, తాడేం గ్రామాల రైతులు సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వరి పైరు పొట్టదశలో ఉందని కావున 15 రోజులకు ఒకసారి న్యాల్కల్ మాసాని చెరువు(అలీసాగర్ ఎత్తిపోతల ద్వార) నుండి సాగునీరు అందించాలని విన్నవించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులతో మాట్లాడారు.. రైతుల విజ్ఞప్తి మేరకు నీరు అందించాలని, రైతులకు పంట పండించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు.దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిత్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్ ఫోరం రూరల్ నియోజకవర్గ అధ్యక్షులు వాసు, పలువురు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన ఉప సర్పంచ్ లతా సురేందర్



**ఇందల్వాయి, ( ప్రజా జ్యోతి )ఆగస్టు 31:** ఇందల్వాయి మండల కేంద్రంలోని రంజిత్ నాయక్ తండకు చెందిన ఉప సర్పంచ్ లతా సురేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత కొంతకాలంగా బీజేపీలో పనిచేసిన సురేందర్.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సర్పంచ్ రాజు నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. రంజిత్ నాయక్ తండలో అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అవసరమని భావించి పార్టీలో చేరినట్లు సురేందర్ పేర్కొన్నారు. గ్రామ వీడీసీ పెద్దల సమక్షంలో డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు, అవసరమైన పరికరాలను అందించేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు సర్పంచులు, ఉప సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల అధ్యక్షులు సుదర్శన్ నాయక్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తోడ్పడుతున్న డాక్టర్ భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచులు, ఉప సర్పంచులు తమ తమ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గ్రామాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేష్ రెడ్డి ముప్పగంగారెడ్డి మునిపల్లి సాయి రెడ్డి మండల అధ్యక్షులు సుదర్శన్ నాయక్, గ్రామ సర్పంచ్ రాజు నాయక్, ఉప సర్పంచ్ లతా సురేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాంట్రాక్టర్ మోతిలాల్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: సర్పంచ్ సంద్ర లత శంకర్



**సిరికొండ, ప్రజా జ్యోతి 31** సిరికొండ మండల కేంద్రంలోని గడ్కోల్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ సంద్రలతశంకర్ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని అలాగే పేదలకు ఇందిరమ్మ ఇల్లు, చేయిత పింఛన్లు, ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాలు కాంగ్రెస్ పార్టీ కల్పిస్తుందని సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోకం సంపత్ రెడ్డి, వార్డ్ మెంబర్స్ వేల్పూర్ గంగారెడ్డి, తలారి హేమంత్, జిపిఓ ఉదయ్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు వెల్మ భానుచందర్ రెడ్డి, వెల్మ రాజేందర్ రెడ్డి, గొల్ల లింబన్న, లింగంపల్లి పోచయ్య, మహిళలు గ్రామసులు పాల్గొన్నారు

# పేషెంట్ల దాహార్తి తీర్చేందుకు సొంత ఖర్చుతో బోరు

**సాయి గంగా హాస్పిటల్‌లో డాక్టర్ గంగాధర్ సేవాభావం**



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 31** ఇందల్వాయి: మండల కేంద్రంలోని సాయి గంగా హాస్పిటల్‌కు వచ్చి వెళ్లే పేషెంట్లు ఎండాకాలంలో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన హాస్పిటల్ నిర్వాహకులు సేవా దృక్పథంతో ముందుకు వచ్చారు. హాస్పిటల్‌కు వచ్చే పేషెంట్ల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో డాక్టర్ కె. గంగాధర్ తన సొంత ఖర్చుతో మంచినీటి బోరు వేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. ఎండాకాలంలో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు మంచినీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో బోరు వేయించినట్లు తెలిపారు. తన వద్దకు వచ్చే పేషెంట్లకు కనీసం మంచినీరు అందించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. హాస్పిటల్ అభివృద్ధి చెందుతున్న సమయంలో కొందరు తమపై అపనిందలు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని డాక్టర్ గంగాధర్ పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి కనీస అవసరమైన మంచినీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో సొంత ఖర్చుతో బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్, రంజిత్‌తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన పేషెంట్లు పాల్గొన్నారు. పేషెంట్ల సౌకర్యార్థం మంచినీటి బోరు ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి జన్మదిన వేడుకలు

**ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు, అంగన్‌వాడీ చిన్నారులకు పండ్ల పంపిణీ**





**ఇందల్వాయి. ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 31** ఇందల్వాయి: నిజామాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఇందల్వాయి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు జిల్లెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జిల్లెల శ్రీనివాస్ మాట్లాడుతూ దినేష్ కులాచారి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బీజేపీ చేపట్టే ప్రజా సేవా కార్యక్రమాలను కార్యకర్తలు ముందుండి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ఇన్‌చార్జి అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకుడు రాజన్న, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మహేష్, రాజు, లోకని గోపి, వినోద్ నాయక్, వంశీతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాణ్యతలేని పనులతో బ్రిడ్జికి రంధ్రాలు

**మరమ్మతులు చేపట్టకుంటే ప్రజల ప్రాణాలకు ముప్పు: మాజీ సర్పంచ్ సదానంద్**





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 31** మండల కేంద్రంలో ఇటీవల చేపట్టిన రహదారి, బ్రిడ్జి పనుల నాణ్యతపై మాజీ సర్పంచ్ సదానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతలేని పనులు చేసి వదిలేయడంతో బ్రిడ్జి పరిస్థితి ప్రమాదకరంగా మారిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. ఎన్ హెచ్ 44 జాతీయరోడ్డుపై ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. అయితే బ్రిడ్జి కిందికి వెళ్లి పరిశీలిస్తే పలు చోట్ల రంధ్రాలు ఏర్పడి, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి పరిస్థితిని సంబంధిత అధికారులు, టోల్ ప్లాజా యాజమాన్యం వెంటనే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బ్రిడ్జికి ఏర్పడిన రంధ్రాలను తక్షణమే పూడ్చకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు ప్రయాణించే రహదారిపై ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు ఉండటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. టోల్ వసూలు చేస్తున్న యాజమాన్యం రహదారి, బ్రిడ్జి భద్రతపై బాధ్యత వహించాలని కోరారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ప్రమాదం లేకుండా చూడాలని మాజీ సర్పంచ్ సదానంద్ విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందుతుంది: ఎమ్మార్వో బాలయ్య



**ఇందల్వాయి, ( ప్రజా జ్యోతి)ఆగస్టు 31:** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ఎమ్మార్వో బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని రేషన్ షాప్ నంబర్ 3కు 678 రేషన్ కార్డులు, షాప్ నంబర్ 2కు 645 కార్డులు మంజూరై వచ్చాయని తెలిపారు. రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కార్డులు రాని వారు ఎలాంటి అధైర్యానికి గురికావాల్సిన అవసరం లేదని, ప్రతి అర్హులైన కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్డుల కోసం తొందరపడాల్సిన అవసరం లేదని, రేషన్ డీలర్లను ఇబ్బందులకు గురిచేయవద్దని ఎమ్మార్వో బాలయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోకని గంగామణి గంగారం, సర్పంచ్ శ్రీనివాస్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి భరత్, కారోబార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

రూ.14 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలి
బీసీ, ఎస్సీ, ఎస్టీ సంయుక్త కార్యాచరణ కమిటీ డిమాండ్



**ప్రజాజ్యోతి, ఏర్గట్ల(బాల్కొండ):** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో పేద, బడుగు వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంయుక్త కార్యాచరణ కమిటీ, డీఎస్పీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ సంయుక్త కార్యాచరణ కమిటీ జిల్లా సమన్వయకర్త కోటగిరి రామా గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కండెల సుమన్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు తమ చదువులను కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులపై ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఫీజులు చెల్లించలేని కారణంగా విద్యార్థులపై కళాశాలల నుంచి ఒత్తిడి పెరుగుతోందని, కొందరు చదువులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఆర్థిక, మానసిక ఒత్తిడి పెరిగి తీవ్ర పరిణామాలకు దారితీస్తోందన్నారు.

విద్యార్థుల చదువులు నిరాటంకంగా కొనసాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్య ప్రభావం లక్షలాది విద్యార్థుల కుటుంబాలపై పడుతున్నందున ప్రభుత్వం అత్యవసరంగా స్పందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంయుక్త కార్యాచరణ కమిటీ జిల్లా నాయకులు ప్రేమ్‌కుమార్, బాలయ్యచారి, రఘురామ్ ముదిరాజ్, సుదర్శన్, రాజు, నలినీకాంత్, సాగర్‌చారి, గంగారం రజక, డీఎస్పీ జిల్లా నాయకులు ప్రశాంత్, రమేష్, కిరణ్, మహిపాల్, మురళి, భూమేష్, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పసుపు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన

అధిక దిగుబడులు.. మెరుగైన నాణ్యతతో అధిక ఆదాయమే లక్ష్యం

**ప్రజాజ్యోతి, ఏర్గట్ల:** పసుపు సాగులో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తిని పొందేందుకు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఏర్గట్ల మండల కేంద్రంలో సెప్టెంబర్ 1న పసుపు సాగులో అధునాతన ఉత్పత్తి సాంకేతికతలు, సుస్థిర సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

పసుపు పరిశోధనా స్థానం, సుగంధ ద్రవ్యాలపై అఖిల భారత సమన్విత పరిశోధనా ప్రాజెక్టు, కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. పసుపు పరిశోధనా స్థానం అధిపతి, శాస్త్రవేత్త డా. జి. విద్య ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఈ సందర్భంగా పసుపు పంటలో విత్తన ఎంపిక నుంచి పంట కోత వరకు పాటించాల్సిన శాస్త్రీయ విధానాలు, సమగ్ర పోషక యాజమాన్యం, చీడపీడల నియంత్రణ, పంట నాణ్యత పెంపు తదితర అంశాలపై రైతులకు నిపుణులు వివరించనున్నారు. తక్కువ వ్యయంతో మెరుగైన దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులపై కూడా అవగాహన కల్పించనున్నారు.

ప్రస్తుతం పసుపు సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయ పరిష్కార మార్గాలను సూచించడంతో పాటు, మార్కెట్‌లో మంచి ధర లభించేలా నాణ్యమైన పసుపు ఉత్పత్తి చేయాల్సిన ఆవశ్యకతను వివరించనున్నారు. ఆధునిక సాంకేతికతలను సాగులో వినియోగించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

రైతులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను తెలుసుకుని తమ పొలాల్లో అమలు చేసుకోవాలని డా. జి. విద్య సూచించారు. శాస్త్రీయ పద్ధతులతో పసుపు సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు పంట నాణ్యత పెరిగి రైతులకు మెరుగైన ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు.

# కాసుల కోసం కక్కుర్తి..

-మొదటిపేజీ తరువాయి

వారే విక్రయించడం చేస్తున్నారు. నగరాలతోపాటు మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లోనూ ఆర్ ఎంపీ పీఎంపీలు ఆడిందే ఆటగా సాగుతున్నది. ప్రైవేటు దవాఖానలు, డయాగ్నోస్టిక్ సెంటర్లతో చేసుకున్నముందస్తు ఒప్పందాలతో తమవద్దకు వచ్చే వారిని ఆర్ ఎం పీ,పి ఎం పీలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పరీక్షల పేరుతో ల్యాబ్ లకు, మెరుగైన వైద్యం పేరుతో ప్రైవేటు దవాఖానలకు పంపుతూ కాసులు దండుకోవడమే గాకుండా అందినకాడికి దోచుకుంటున్నారు. తాము చెప్పిన దవాఖానకు వెళ్లకుంటే మరో సారి సంప్రదించే జనాలకు ప్రథమ చికిత్స చేయకుండా, ఇబ్బందులకు గురిచేస్తున్నారు. జిల్లాలో పట్టణాలు,పల్లెల్లో కలిపి సుమారు 3 వేల వరకు ఆర్ఎంపీ పీఎంపీలు ఉన్నారు. ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు ఆర్ఎంపి. పిఎంపీల వివరాలను సేకరించి వారిని సంప్రదిస్తున్నారు. దవాఖానలో చేరిన రోగి బిల్లులో 40 నుంచి 50 శాతానికి పైగా కమీషన్ ఇచ్చేలా ముందస్తుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒప్పందం ప్రకారం వారం నెలకోసారి కమిషన్ ముట్టజెప్పున్నారు. ఎక్కువ మంది రోగులకు పంపిన వారికి గోవా ,బ్యాంకాక్ ట్రిప్పులను సైతం ఆఫర్ చేస్తుండడం విశేషం. ఇదే అదనుగా కొంతమంది ఆర్ఎంపి, పిఎంపీలు తాము పంపించే దవాఖానలో తక్కువ ఫీజు తీసుకుంటారంటూ రోగులను ప్రైవేటు దవాఖానలకు పంపి కమీషన్లు దండుకుం టున్నారు. ఫిర్యాదు చేసినా వైద్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. వారి ఆగడాలపై కొందరు ఫిర్యాదు చేస్తే కొంతమంది ఆర్ఎంపి,పిఎంపిలు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోకి వచ్చి సిబ్బందికి ముడుపులు చెల్లించుకుంటున్నట్లు సమాచారం..

**ప్రైవేటు దవాఖానలతో కలిసి దోపిడీ..**

జిల్లాలో ప్రైవేటు దవాఖానలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నగ రంలోనే 400 వరకు ప్రైవేట్ దవాఖానాలు ఉండగా, ఇందులో 50 వరకు మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖానలు ఉన్నాయి. పేరుకు మాత్రమే మల్టీ స్పెషాలిటీ దవాఖానలు అందులో ఒకరు లేదా ఇద్దరు డాక్టర్లు మాత్రమే సేవలందిస్తారు. సిబ్బంది ఉండరు. బిల్లులు మాత్రం లక్షల్లో వేస్తారు. పిఎంపీ, ఆర్ఎంపీలు రిఫరల్ చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఒకప్పుడు ఎంబిబిఎస్,ఎండీ ఆ పైన చదివిన వారు మాత్రమే క్లినిక్ లు పెట్టుకొని రోగులకు వైద్యం చేసే వారు. ఇప్పుడు వైద్యం వ్యాపారంగా మారింది, ముగ్గురు నలుగురు కలిసి ఈ దందాలోకి దిగుతున్నారు. భవనాలను అద్దెకు తీసుకొని వైద్యులను నియమించుకొని దవాఖానాలు ఏర్పాటుచేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, ప్రజాజ్యోతి ఆగస్టు 31 :** ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుప త్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, రాజేందర్,విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ ప్లాన్ ఫైల్ ను వెనక్కి తెప్పిస్తున్నాం

. . . పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్ ప్రతినిధి, ప్రజాజ్యోతి ఆగస్టు 31 :** గత ప్రభుత్వం ప్రతిపాదించిన నిజామాబాద్ నగర మాస్టర్ ప్లాన్,అదేవిధంగా నూడ మాస్టర్ ప్లాన్ లో అనేక లోపాలు ఉన్న దృష్ట్యా ఆ ఫైల్ ను వెనక్కి తెప్పిస్తామని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నగర అభివృద్ధి కమిటీ ప్రతినిధులకు గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ పై ప్రజాభిప్రాయ సేకరణ,గతంలో అభ్యంతరాలు, మార్పులు,కోరిన వారితో చర్చలు జరిపి సమగ్రంగా అందరి ఆమోదంతో మాస్టర్ ప్లాన్ ను ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపిస్తామని అన్నారు.ఆ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.నగర అభివృద్ధి కమిటీ నగరంలోని పలు ముఖ్య సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. అన్నింటిపై సంబంధిత అధికారులతో చర్చించి ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రోడ్ల నిర్మాణం,ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించటం జరుగుతుందని ఆయన తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆకుల ప్రసాదు ప్రధాన కార్యదర్శి కే రామ్మోహన్రావు ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ నారాయణరెడ్డి కరిపే రవీందర్, జహీరుద్దీన్, ముస్తఫా, నాగేశ్వరరావు, గట్ల రాజు,సత్యం తదితరులున్నారు.

# పీఆర్టీయూ-టీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గాండ్ల రాజశేఖర్ విజయం



**ప్రజాజ్యోతి, ఏర్గట్ల:** నిజామాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన నిజామాబాద్ జిల్లా పీఆర్టీయూ-టీఎస్ కార్యవర్గ ఎన్నికల్లో ఏర్గట్ల మండలానికి చెందిన గాండ్ల రాజశేఖర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ విషయాన్ని పీఆర్టీయూ-టీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్ తెలిపారు. రాజశేఖర్ విజయాన్ని పురస్కరించుకుని మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ శర్మతో పాటు మండల, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు. తన విజయానికి సహకరించిన మండల అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ శర్మ, మండల మాజీ అధ్యక్షుడు శేర్ల శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులకు రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజశేఖర్ పేర్కొన్నారు.

# అంటరానితనం నేరం.. కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు

ఇందల్వాయిలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ



**ఇందల్వాయి:** పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో షెడ్యూల్డ్ కులాల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లోకానికి గంగవాణి గంగారం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనంతరావు, తహసీల్దార్ (ఎమ్మార్వో), ఎస్సైతో పాటు దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనంతరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలను వేరు చేసి చూడకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో మెలగాలని సూచించారు. అంటరానితనం పాటించడం చట్టరీత్యా నేరమని, కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. పౌరులందరూ రాజ్యాంగ హక్కులను తెలుసుకుని, పరస్పరం గౌరవించుకుంటూ సామరస్యంగా జీవించాలని కోరారు. ఎమ్మార్వో మాట్లాడుతూ "కలిసి ఉంటే కలదు సుఖం" అనే భావనతో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కుల వివక్షకు తావులేకుండా సామాజిక సమానత్వాన్ని పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ కులం, జాతి పేర్లతో ఎవరినీ అవమానించరాదని అన్నారు. అందరూ సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని సూచించారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సామాజిక సమానత్వం, అంటరానితనం నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం దళిత సంఘాల నాయకులు అధికారులను సన్మానించారు ఈ కార్యక్రమానికి దళిత సంఘాల ప్రతినిధులు, నామాల గంగారాం. బాల సాయిలు. తుమ్మల నరసయ్య. జగ్గా ప్రవీణ్. పూజం వీరయ్య తుమ్మల చంటి. పాశం చిన నర్సింలు. గ్రామ ప్రజలు తదితరులు హాజరయ్యారు.

# కొత్తపల్లిలో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం.



**ముప్కాల్, ప్రజాజోతి, ఆగస్టు 31** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విఫలమైందని ఆరోపిస్తూ ముప్కాల్ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు.ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, కార్యదర్శి ఉమాశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, ప్రస్తుత సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచులు, ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు, యువజన సంఘ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల జీవన భృతిని పెంచాలి



**ధర్పల్లి (ప్రజా జ్యోతి) ఆగస్టు 31** బీడీ కార్మికులకు అందిస్తున్న జీవనభృతిని నాలుగు వేల రూపాయలకు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు దర్పల్లి మండల కేంద్రంలో సోమవారం రోజు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు అర్హులైన బీడీ కార్మికులు అందరికీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరారు నెల రోజులలో 26 రోజులు పని కల్పించాలని కోరారు ఇటీవల సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిఐటియు తెలంగాణ బీడీ సిగర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించినట్లు తెలిపారు ఈ సందర్భంగా మహాసభలో బీడీ కార్మికుల సమస్యలపై పలు తీర్మానాలు చేసినట్లు వారు వివరించారు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని వారు తెలిపారు సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ సిపిఐ ఎంఎల్ భీమ్ గల్ ఏరియా ఇంచార్జ్ గడ్డం గంగా మోహన్ పాల్గొన్నారు

# బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ కావాలి

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నాలుగిండ్లు మాత్రమే బంగారు మాయమయ్యాయని అన్నారు. సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాలు బాగుపడాల్సిన అవసరముందని అందుకోసం సామాజిక న్యాయ తెలంగాణ అవసరమని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం 20 ఏళ్లు కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్ నుంచి నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పదవుల కోసం పార్టీ పెట్టలేదని తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం పంతం పట్టి పార్టీ పెట్టానని అన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత సొంతూరు నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని కవిత అన్నారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ ఏ విధంగా ఆశీర్వాదం ఇచ్చారో ఇప్పుడు కూడా అదే ఆశీర్వాదం ఇవ్వాలని కవిత నిజామాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పదవుల కోసమైతే ఏ రాజకీయ పార్టీలోకైనా వెళ్లవచ్చుని...కానీ తాను చూడని పదవులు లేవన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న పతంతోనే నేను పార్టీ పెట్టానన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత తన సొంతగడ్డ నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని చెప్పారు. సొంత గడ్డపై సొంత మనుషులను చూసి కవిత భావోద్వేగానికి లోమయ్యారు. ఎంత ఆపుకుందామనుకున్న కన్నీళ్లు ఆగటం లేదంటూ ఈ సందర్భంగా ఆమె అన్నారు. అలాగని తనను పిరికిదాన్ని అనుకోవద్దని... ఆడబిడ్డల గుండెల్లో బాధ ఉంటే కన్నీళ్లు వస్తాయని చెప్పారు. ఇక గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ గెలిపించి తనను ఎలా ఆశీర్వదించారో అదే విధంగా తనకు ఆశీర్వాదం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఏ తప్పు చేయకున్న సరే తీహార్ జైల్లో పెట్టినప్పటికీ ధైర్యం సడలలదేని.దారి తప్పలేదని కవిత గుర్తు చేసుకున్నారు. అప్పుడే తాను తప్పు చేయలేదని. నిజామాబాద్ నిప్పు బిడ్డనని చెప్పానని అన్నారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు కోసం ఐదు కీలకాంశాలతో తాము ముందుకు వెళ్తున్నట్లు కవిత చెప్పారు. పాంచజన్యం పేరుతో ఐదు కీలకాంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నామన్నారు. ఉచిత విద్య, వైద్యం ప్రతి కుటుంబానికి ఇస్తామన్నారు. ఇందుకోసం డబ్బులు ఎక్కడివి అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తారని...కానీ మన ఆదాయమే ఏటా 2 లక్షల కోట్లు ఉందని కవిత అన్నారు. అందులో లక్ష కోట్లు పెడితే ఉచిత విద్య, వైద్యం అందించవచ్చని చెప్పారు. బహుజన తెలంగాణ అంటే అన్ని కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పారు. ఏ




కులం వెనుకబడిన తెలంగాణ ముందుకు వెళ్లదని చెప్పారు. అగ్రవర్ణాల్లో పేదలు కూడా బాగుపడాలని కవిత అన్నారు. అందుకోసం ఓ వైపు కాంగ్రెస్ పార్టీతో పోరాటం చేస్తూనే మరోవైపు టీఆర్ఎస్ పార్టీని నిర్మాణం చేసుకుంటామన్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో ఐదు అసెంబ్లీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేపటితో వెయ్యి రోజులైనప్పటికీ ఇప్పటికీ వాళ్లు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని కవిత విమర్శించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన పార్టీని నిలదీయాలా వద్దా అని ప్రజలను ప్రశ్నించారు. అవినీతి కారణంగా కాంగ్రెస్ తో బీఆర్ఎస్ మిలాఖత్ అయ్యిందన్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే చూస్తే ప్రజలు సమస్యల్లో ఉన్నప్పటికీ ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎందుకు ప్రజల కోసం పోరాటం చేయటం లేదో చెప్పాలన్నారు. జీవన్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి అక్రమాలపై కాంగ్రెస్ ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ తో బీఆర్ఎస్ కు ఉన్న అండర్ స్టాండింగ్ ఏంటో చెప్పాలన్నారు. నిజామాబాద్ జిల్లా నాయకుడు ప్రశాంత్ రెడ్డి పై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రితో తనకు దూరం చేసిన వ్యక్తి ఆయనేనని అన్నారు. తండ్రి, కూతురును పాపిన వ్యక్తి ప్రశాంత్ రెడ్డేనని చెప్పారు. హరీష్ రావు, సంతోష్ రావు లను అయిన క్షమిస్తానేమో గానీ ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించనని కవిత అన్నారు. తన ఉసురు కచ్చితంగా ఆయనకు తగులుతుందన్నారు. ప్రశాంత్ రెడ్డిని పెద్ద కొడుకులా చూసుకొని పిలిచి అన్నం పెట్టిన కేసీఆర్ కు అన్యాయం చేసే ప్రయత్నం చేశాడన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పేరులోనే ధర్మం ఉందని...ఆయనలో ఉందంతా అధర్మమే అని కవిత విమర్శించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మాధవ్ నగర్ బ్రిడ్జి పనులు పూర్తి కాలేదని విమర్శించిన అర్వింద్ ఇప్పుడేం చేస్తున్నారని ప్రశ్నించారు. అప్పుడు తాను కేకే ట్యాక్స్ వసూలు చేశానని మాట్లాడిన అర్వింద్ ఇప్పుడు ఏం ట్యాక్స్ వసూల్ చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అడ్డగోలుగా మాట్లాడే అర్వింద్...కేంద్రం నుంచి ఎన్ని పైసలు తెచ్చారో చెప్పాలన్నారు. పసుపు బోర్డు కారణంగా రైతులకు పైసా మేలు జరగలేదని కవిత విమర్శించారు. నిజామాబాద్ ప్రజలే నా ధైర్యమని కవిత చెప్పారు. తనను ఎంపీగా, ఎమ్మెల్సీగా ఇక్కడి ప్రజలు గెలిపించటంతోనే తాను ఎక్కడైనా ధైర్యంగా మాట్లాడగలిగానని అన్నారు. ఇదివరకు మాదిరిగానే ఇప్పుడు కూడా తనకు నిజామాబాద్ ప్రజల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. తల్లి గారు కర్కశంగా బయటకు పంపిస్తే అత్తగారి కుటుంబమే తనను కన్న కూతురిగా ఆదరించిందని చెప్పారు. నిజామాబాద్ కోడలిగా తాను గర్వపడతానన్నారు. ఎంపీగా ఎమ్మెల్సీ ఉన్న సమయంలో ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డానని చెప్పారు. బీడీ కార్మికులకు పోరాటం చేసి పెన్షన్ ఇప్పించానని కవిత గుర్తు చేశారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ఎన్నో సార్లు కేసీఆర్ తో మాట్లాడినప్పటికీ ఆయన పట్టించుకోలేదని చెప్పారు. షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు 18 కోట్లు ఇవ్వాలని కోరితే కేటీఆర్ ఇవ్వలేదన్నారు. అయితే తన దోస్తు కోరుట్ల ఎమ్మెల్యే కోసమే కేటీఆర్ ఈ షుగర్ ఫ్యాక్టరీ తెరవకుండా అడ్డుపడ్డాడని కవిత చెప్పారు. సారంగపూర్ లో షుగర్ ఫ్యాక్టరీ కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు అండగా ఉంటామని కవిత చెప్పారు. నిజామాబాద్ లో ప్రజలకు ఏ కష్టమొచ్చినా సరే టీఆర్ఎస్ శ్రేణులు ముందుండి పోరాటం చేస్తాయన్నారు.

## నిర్మల్ వరకు బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

తాళ్లరాంపూర్, తడపాకల్ మీదుగా రవాణా సౌకర్యం కల్పించాలని వినతి



**ప్రజాజ్యోతి, ఏర్గట్ల:** మెట్‌పల్లి నుంచి బట్టాపూర్, ఏర్గట్ల, తాళ్లరాంపూర్, తడపాకల్ గ్రామాల మీదుగా నిర్మల్ వరకు నడిచే బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు మెట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ హరి సార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ మార్గంలో బస్సు సౌకర్యం అందుబాటులో ఉండటంతో పరిసర గ్రామాల ప్రజలు నిర్మల్, మెట్‌పల్లి ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఎంతో సౌకర్యంగా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం బస్సు సర్వీసు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వృద్ధులు ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధాన రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు ప్రజా రవాణా సౌకర్యం అత్యవసరమని, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు అందుబాటులో ఉంటే పలు గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మెట్‌పల్లి నుంచి నిర్మల్ వరకు బట్టాపూర్, ఏర్గట్ల, తాళ్లరాంపూర్, తడపాకల్ గ్రామాల మీదుగా బస్సు సర్వీసును త్వరగా పునరుద్ధరించాలని కోరారు. ప్రజల విజ్ఞప్తిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టాపూర్ గ్రామ సర్పంచ్ భూషణవేణి ప్రవీణ్ యాదవ్, ఉపసర్పంచ్ మూఢ్ దయానంద్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేణుగౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి బుచ్చ యాదవ్ (చిన్న నర్సయ్య యాదవ్), కమిటీ సభ్యుడు గద్దల ముత్తేన్న తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగింపు



**ప్రజా జ్యోతి, ఆగస్టు 31, పోతంగల్.** చేయూత సామాజిక భద్రతా పింఛన్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం సెప్టెంబర్ 15 వరకు పొడిగించిందని కోటగిరి మండల స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ తెలిపినారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు అవకాశం ఉండగా, అర్హులైన వారికి మరింత అవకాశం కల్పించేందుకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. చేయుత పింఛన్ కొరకు అర్హత ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సర్పంచ్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సమాచారం అందేలా మండల అధికారులు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

## 35 ఏళ్ల సేవకు ఘన వీడ్కోలు.

**బోధన్ ఆర్టీసీ డిపోలో హెల్పర్ మెకానిక్‌గా విశిష్ట సేవలు.. రాజనర్సుకు ఘన సన్మానం.**






**ఎడపల్లి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):** బోధన్ ఆర్టీసీ డిపోలో హెల్పర్ మెకానిక్‌గా 35 సంవత్సరాల పాటు నిబద్ధతతో, క్రమశిక్షణతో విశిష్ట సేవలందించిన గడ్డం రాజనర్సు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్, అధికారులు, సహోద్యోగులు, సిబ్బంది రాజనర్సును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ 35 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో రాజనర్సు విధుల పట్ల చూపిన అంకితభావం, నిబద్ధత, క్రమశిక్షణ ప్రశంసనీయమన్నారు. సంస్థ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు, సహోద్యోగులతో కలిసిమెలిసి పనిచేసిన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుందని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి రాజనర్సు కుటుంబ సభ్యులు, కూతుళ్లు, అల్లుళ్లు, కుమారుడు, కోడలు, మనవరాళ్లు, మనవళ్లు, బంధుమిత్రులు హాజరై ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహోద్యోగులు, బంధుమిత్రులు రాజనర్సుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను ప్రశంసించారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన రాజనర్సుకు పదవీ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

## వేదమంత్రాల నడుమ సంకట వినాయకుడికి ప్రత్యేక పూజలు





**ప్రజా జ్యోతి, 31 ఆగస్టు పోతంగల్, ఆగస్టు 31.** కోటగిరి మండల కేంద్రంలోని వినాయక నగర్ లో సంకట వినాయక గణేష్ విగ్రహ ప్రతిష్టాపన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దత్తాత్రి కులకర్ణి ఆధ్వర్యంలో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి, వేదమంత్రోచ్చారణాల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంకట వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షులు కూచి సిద్దు, ప్రధాన కార్యదర్శి బి. గజేందర్, కోశాధికారి అశోక్, సభ్యులు, కాలనీ పెద్దలు వెంకటేశం సేట్, నాగిరెడ్డి,పి. హన్మాండ్లు, గర్దేష్ కిరణ్, సాయిలు, రాజు, పత్తి అబ్బయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ

**సిరికొండ, ప్రజా జ్యోతి, 31** సిరికొండ మండల కేంద్రంలోని పెద్దవల్గొట్ గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పేదలకు అందించిన రేషన్ కార్డులను ప్రజలు ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలను ప్రవేశం పెట్టిందని సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాము మండల కిసాన్ కేత్ అధ్యక్షులు గాదరి నర్సారెడ్డి జి పి ఓ నవీన్ వార్డ్ మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు



## వ్యవసాయ కళాశాలకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలి: పిడిఎస్




**నిజామాబాదు రూరల్ , ప్రజా జ్యోతి 31** తెలంగాణ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములను వ్యవసాయ కళాశాల నిర్మాణానికి కేటాయించే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమంలో భాగంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. అనిల్ కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ, అందుకోసం ఇప్పటికే ఉన్న తెలంగాణ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములను కేటాయించడం మాత్రం సరైన నిర్ణయం కాదన్నారు. యూనివర్సిటీ భూములు భవిష్యత్‌లో విద్యార్థుల అవసరాలకు, కొత్త కోర్సులు, పరిశోధనా కేంద్రాలు, హాస్టళ్లు, ప్రయోగశాలలు మరియు ఇతర విద్యా మౌలిక వసతుల విస్తరణకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఇప్పటికే ఉన్నత విద్యను అందిస్తున్న ముఖ్యమైన ప్రభుత్వ విశ్వవిద్యాలయమని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని యూనివర్సిటీకి కేటాయించిన భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. యూనివర్సిటీ అవసరాలను పక్కనపెట్టి భూములను ఇతర సంస్థలకు కేటాయించడం వల్ల భవిష్యత్‌లో యూనివర్సిటీ విస్తరణకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిని కేటాయించి, తెలంగాణ యూనివర్సిటీ భూములను యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై యూనివర్సిటీ అధికారులు కూడా స్పష్టమైన వైఖరి తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, ప్రజలను కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూనివర్సిటీ,జిల్లా నాయకులు నితిన్,సంజయ్,మున్నా తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

**సిరికొండ, ప్రజా జ్యోతి 31** నిజామాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు దినేష్ కులచారి జన్మదిన పురస్కరించుకొని సిరికొండ మండలం బిజెపి అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు సందర్భంగా బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బిజెపిని బలపరచడానికి దినేష్ కులచారి కీలక పాత్ర పోషించారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్, కిషన్ అధ్యక్షులు ప్రభాకర్ ధర్పల్లి బాబురావు,గోపి, రాజు బిజెపి నాయకులు పాల్గొన్నారు



# రాజకీయ వత్తిడి మూలంగానే వెనకడుగు

**-- జె.జె.సి.పి. బాబూరావు రీసెర్చ్ స్కాలర్**



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకాన్నిపెంగ్విన్ రాండమ్ హౌస్ యొక్క అనుబంధ సంస్థ అయిన అమెరికన్ ప్రచురణ సంస్థ ఆల్ఫ్రెడ్ ఎ నాఫ్ నవంబర్ 10 నాడు విడుదల చేయనున్నట్లు ప్రకటించిన కొద్ది రోజులకే 'తాము ఆ పుస్తకానికి ప్రచురణకర్త కాదు, ఆ పుస్తకాన్ని ప్రచురించడం లేదు' అని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా (పి.ఆర్.హెచ్.ఐ) ఈ ఆగస్టు 28 నాడు ప్రకటించింది. పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఇలా వివాద వార్తల్లో నిలవడం ఇదే మొదటిసారి కాదు. 2013 నాటి ముజఫర్‌నగర్ అల్లర్ల ఆధారంగా గ్రాఫిక్ నవలా రచయిత జో సాకో రాసిన 'ది వన్స్ అండ్ ఫ్యూచర్ రాయట్' పుస్తకాన్ని కూడా పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా వెనక్కి తీసుకుంది. అయితే 'ఆ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవడానికి ప్రచురణ సంస్థ సాకులు చెప్పింది' అని రచయిత సాకో వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' అనే ఆత్మకథను తాము ప్రచురించలేదు' అని పి.ఆర్.హెచ్.ఐ పేర్కొన్ననూ ఆ పుస్తకం యొక్క హార్డ్ కాపీని కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటులో ప్రదర్శించడం గమనార్హం. ఆ రకంగా ఆ పుస్తకం యొక్క హార్డ్ కాపీలు మరియు రాతప్రతి యొక్క డిజిటల్ కాపీలు బయటకు రావడంతో వివాదం మరింతగా చెలరేగింది. తాజాగా 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తక మాన్యుస్క్రిప్ట్‌లో గల ఒక భాగంలో పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా కోరిన కొన్ని మార్పులు మరియు తొలగింపులను రచయిత్రి సోనియా గాంధీ తిరస్కరించడంతో ఈ వివాదం నెలకొంది. అధికారిక సమావేశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సోనియా గాంధీ వ్యక్తీకరించిన అభిప్రాయాలు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మరియు దాని కార్యకలాపాలకు సంబంధించిన విషయాలు మరియు భారత్ – చైనా సంబంధాలు మొదలైన అంశాలు ప్రస్తుత వివాదానికి దారితీశాయి. ప్రచురణకర్తకు, రచయిత్రి సోనియా గాంధీకి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తడం మూలంగా అంతిమంగా మార్పులు, తొలగింపులను ఆమె తిరస్కరించడంతో పెంగ్విన్ ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే ఆత్మకథను ప్రచురించడానికి నిరాకరించిన విషయం వెలుగులోకి వచ్చింది. 'తాము సూచించిన మార్పులను రచయిత్రి తిరస్కరించినందువలన మేము ఆ పుస్తకాన్ని ప్రచురించకూడదు అని నిర్ణయించుకున్నట్లుగా వచ్చిన వార్తలు వాస్తవ పరిణామాలకు భిన్నంగా ఉన్నాయి. అయితే ఒక ప్రచురణకర్తగా, వాస్తవాలను సరిచూడటం మరియు రచయితల పుస్తకాల ఉత్తమ ప్రయోజనాలకు అనుగుణంగా సిఫార్సులను అందించడం మా ప్రత్యేక హక్కు మరియు బాధ్యత మాత్రమే కాకుండా ఇది ప్రచురణ ప్రక్రియలో ఒక సాధారణ భాగం. మేము చర్చలు జరిపిన సమయంలో ప్రచురణకు ఆసక్తిగా ఉన్నప్పటికి కొన్ని కారణాల వల్ల ఆ బాధ్యతలను తీసుకోలేదు' అని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా తనను తాను సమర్థించుకుంది. ఏది ఏమైననూ 'అధికార బి.జె.పి పార్టీ నుండి రాజకీయ వత్తిడి ఉండడం మూలంగానే పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఆ పుస్తకాన్ని ప్రచురించడానికి నిరాకరించింది' అని బాహాటంగానే విమర్శలు వెలువెత్తాయి. కేవలం రాజకీయ ఒత్తిడి మూలంగా ఇటలీ నుండి భారతదేశానికి శ్రీమతి సోనియా గాంధీ రాజకీయ గమనాన్ని వివరించే 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తక ప్రచురణ నుండి మార్పులు – చేర్పులు అంటూ ఉపసంహరించుకోవడం అనేది ఊహించని మలుపు కావడమే కాకుండా అంతిమంగా భావాస్వేచ్ఛను నిరాకరించడమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావాలను వ్యక్తీకరించడం, పుస్తకాలను రాయడం అనే స్వేచ్ఛ అందరికి ఉంది. పుస్తకం జనబాహుళ్యంలోకి వచ్చాకా అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిర్ద్వందంగా ప్రశ్నించవచ్చు. కాని పుస్తకం విడుదలకు ముందే రాజకీయ ఒత్తిడికి తలొగ్గి మార్పులు, చేర్పులు కోరడం ఏరకంగానూ సమర్థనీయం కాదు. అంతిమంగా శ్రీమతి సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకాన్ని విడుదలకు ముందే ఎప్పుడెప్పుడు చదవాలి అనే ఆసక్తిని మరియు ఉత్సుకతను రేకెత్తిస్తూనే ఉంది.

## హామీలు ఘనం.. పింఛన్ల మంజూరు శూన్యం!

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను పెంచి అర్హులందరికీ అందిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొత్తగా అర్హులైన అనేక మందికి పింఛన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమని విమర్శించారు. హామీలకే పరిమితమవకుండా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, బీడీ కార్మికుల పింఛన్లను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే మంజూరు చేయాలి అని అన్నారు. పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి స్వస్తి పలికి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని అధికారులను కోరారు. పింఛన్ల విషయంలో ప్రభుత్వం ఇకనైనా స్పందించకపోతే లబ్ధిదారుల తరపున పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆకుల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, అల్తాఫ్ లతో పాటు ఆయా గ్రామాల పెన్షన్ బాధితులు పాల్గొన్నారు.

## డోంగ్లి ఉన్నత పాఠశాలలో ఎన్ సీసీ కోర్సులు ప్రవేశపెట్టండి



**డోంగ్లి ఆగస్టు 31 (ప్రజాజ్యోతి)** కామరెడ్డి జిల్లా డోంగ్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో శశాంక్ పటేల్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అధికారులకు రెండు ఫిర్యాదులు అందజేశారు. అందులో మొదటిది.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ సిసి కోర్సును ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కోర్సు చేయాలంటే విద్యార్థులు జిల్లా కేంద్రమైన కామారెడ్డికి దాదాపుగా 100 కిలోమీటర్లు వెళ్ళాలని తెలిపారు. ఈ కోర్సు వల్ల ప్రభుత్వ పోటీ పరీక్షల్లో వెయిటేజ్ మార్కులు ఉంటాయని గుర్తు చేశారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, ఎన్ సీసీ ఫార్ముల ఉన్న ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టి ఈ ప్రాంత విద్యార్థులకు ఈ కోర్సు అందించాలని విన్నవించారు. మరొకటి.. గత పదేండ్లుగా మండల కేంద్రంలోని మెన్ రోడ్డు గుండా ఉన్న ఎస్సీ కాలనీలో అభివృద్ధికి నోచుకోని పెద్ద మురికి కాలువల పనులను చేపట్టారు. కానీ ఆ మురికి కాలువ పనుల మెజర్ మెంట్ రికార్డు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని వాపోయారు. వెంటనే ఎంబి రికార్డ్ చేసి నిధులు మంజూరు చేయించాలని ప్రజావాణి వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మికతనికి

**-- జిల్లా అధికారి జి. విక్రం**

**ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి**



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లా కామారెడ్డి పట్టణంలోని న్యూ బస్ స్టాండ్ పరిసరాల్లో ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్లను ఆహార భద్రతాధికారి జి. విక్రమ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, వంటశాలల పరిశుభ్రత, వినియోగిస్తున్న పరికరాలను పరిశీలించారు. తనిఖీల్లో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించినట్లు ఆహార భద్రతాధికారి తెలిపారు. అదేవిధంగా ఆహార పదార్థాల తయారీలో స్టెయిన్‌లెస్ స్టీల్ కత్తులకు బదులుగా ఇనుప కత్తులను వినియోగిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఆహార పదార్థాల తయారీ, విక్రయాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆహార భద్రతాధికారి జి. విక్రమ్ హోటల్, రెస్టారెంట్ యజమానులకు సూచించారు. నిబంధనలు పాటించని సంబంధిత యజమానులకు మెరుగుదల నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసుల్లో పేర్కొన్న సూచనలను నిర్దేశిత సమయంలోగా అమలు చేసి వంటశాలల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన లోపాలను సరిదిద్దకపోతే, ఆహార భద్రతా నిబంధనల ప్రకారం సంబంధిత వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా హోటళ్లు, రెస్టారెంట్లలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని ఆహార భద్రతాధికారి జి. విక్రమ్ తెలిపారు.

## పుస్తె మట్టెలు అందజేత

**-- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి**



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో ఉన్న బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో జరుగుతున్న నూతన దంపతుల వివాహ మహోత్సవానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి హాజరై పుస్తె మట్టెలు అందజేశారు. మద్దికుంట శివాలయం ఆలయ ప్రాంగణంలో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, ఆడపడుచులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేద కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు తమ వంతు సహకారం అందిస్తూ, వారికి అండగా నిలవడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.కట్ట సప్న వివాహానికి పుస్తె మట్టెలు అందజేసి నూతన వధూవరుల దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో, రామారెడ్డి సర్పంచ్ బండి ప్రవీణ్, ఉప సర్పంచ్ నవీన్, డిసిసి జనరల్ సెక్రెటరీ, జూలూరి సుధాకర్, కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మున్సిపల్స్, కౌన్సిలర్, గడ్డ మీది మహేష్, మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, కోటి, పండు శ్రీకాంత్, శశి మున్న,రాహుల్, ఆకాష్,ఉన్నారు.

## అన్నబహు సాటే స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలి

**జయంతి ఉత్సవాల్లో మీరేవార్ సాయిలు**



**డొంగ్లీ ఆగస్టు 31 (ప్రజాజ్యోతి)** అన్న బహు సాటే స్ఫూర్తితో నేటి యువత ఆయన అడుగుజాడల్లో ముందుకెళ్లాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మీరేవార్ సాయిలు యువతను కోరారు. మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామంలో అన్నా బహు సాటే 106వ జయంతి ఉత్సవాలు సాయిలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో జెండాను ఆవిష్కరించి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్న బహు సాటే జాతి కోసం ఎంతో కృషి చేశారని, ఆయన చూపించిన మార్గంలో నేటి యువత ముందుకు వెళ్లాలని కోరారు, ఈ జయంతి కార్యక్రమంలో ఆకాష్ యాదవ్ బస్వంత్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ కార్యాలయంలో ఉచిత నేత్ర పరీక్షల క్యాంప్

-మొదటిపేజీ తరువాయి

నేత్ర ఆరోగ్యంపై అవగాహన పెంచడం మరియు దృష్టి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సహాయం అందించే లక్ష్యంతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉచిత నేత్ర పరీక్షల క్యాంప్, అవగాహన సదస్సు మరియు నేత్ర దాన ప్రతిజ్ఞ ప్రచారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం: ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది మరియు కలెక్టరేట్ కు వచ్చే సాధారణ ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన సలహాలు, సూచనలు అందించడం మరియు నేత్ర దానం యొక్క ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేయించడం.

**కార్యక్రమ వివరాలు**

ఉచిత కంటి పరీక్షలు నిపుణులైన నేత్ర వైద్య నిపుణుల ద్వారా కలెక్టరేట్ సిబ్బందికి మరియు ప్రజలకు కంప్యూటరీకృత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇట్టి శిబిరం లో 175 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగింది మరియు 113 మందికి కంటి అద్దాలు పంపిణి చేయడం జరిగింది. అవగాహన సదస్సు దైనందిన జీవితంలో కంటి చూపును సంరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ స్క్రీన్ల వల్ల కలిగే కంటి అలసటను నివారించే మార్గాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.నేత్ర దాన ప్రతిజ్ఞ అంధత్వాన్ని నివారించడంలో నేత్ర దానం యొక్క ప్రాముఖ్యతను వివరించి, జిల్లా అధికారులచేత మరియు ఉద్యోగులు , పలువురిచే నేత్ర దాన ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిశనల్ కలెక్టర్ విక్టర్ మరియు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.వెంకటి మరియు ఆప్థాల్మిక్ ఆఫీసర్లు రవిందర్ మరియు హరి కిషన్ మరియు వైద్యులు డా.మారుతి బాబు, డా.సంతోష్ ఆశాలు, ఏ.ఎన్.ఎం.లు మరియు జిల్లా స్థాయి అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కలెక్టరేట్ ఉద్యోగులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి ప్రధాన లక్ష్యం



-మొదటిపేజీ తరువాయి

దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందే ప్రతి వినతిపై నిర్లక్ష్యం లేకుండా స్పందించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారుల సమస్యలను పూర్తిగా తెలుసుకొని, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

## మున్సిపల్ ఎజెండా అంశం తీర్మానాలను తొలగించాలి

-- బిజెపి కౌన్సిలర్ ల వినతి పత్రం





**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** ఆగస్ట్ 29 న జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలోని టేబుల్ ఎజెండా అంశం తీర్మానాల నుండి తొలగించాలని బీజేపీ కౌన్సిలర్ ల వినతి పత్రం శనివారం అనగా ఆగస్ట్ 29 2026 రోజున మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ అత్యవసర సమావేశంలో ముందు పంపిన ఎజెండా అంశాలు కాకుండా ఎలాంటి టేబుల్ ఎజెండా అంశాలను కూడా తీర్మానాలలో ఉంచరాదని ఏదైనా అంశం వుంటే మరో సారి మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి ఎజెండా అంశాలను చర్చించి తీర్మానం చేయాలని బీజేపీ కౌన్సిలర్ లు మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమరాణి కి, కమిషనర్ పర్వతాలు కి మరియు కలెక్టర్,ఆడిషన్ కలెక్టర్ అందుబాటులో లేని కారణంగా ఏవో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విముక్త జాతుల దినోత్సవం

**-- ఘనంగా నిర్వహణ**



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఉదయం 10.00 గంటలకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విముక్త జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ హాజరయ్యారు. డిప్యూటీ కలెక్టర్ రవి తేజ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, ఏబీసీడీఓ చక్రధర్, బీసీ సంఘాల నాయకులు, సంచార జాతులు మరియు విముక్త జాతుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, సంచార జాతులు, విముక్త జాతులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా మరియు ఉపాధి సమస్యలను వివరించారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ మాట్లాడుతూ, సంచార మరియు విముక్త జాతుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్య, ఉపాధి మరియు ఆర్థిక అభివృద్ధి ద్వారా సమాజంలో అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సాపా శివరాము, కొత్తపల్లి మల్లయ్య, రాజయ్య, నీల నాగరాజు, మొండి శ్రీనివాస్, నాగరాజు, మందుల శ్రీనివాస్, జనార్ధన్, లక్మణ్, లింబాద్రి, నరేష్, స్వప్న, అశ్వక్, శాంతయ్య, శ్రీకర్ తదితర బీసీ సంఘాల నాయకులు, సంచార జాతులు మరియు విముక్త జాతుల ప్రతినిధులు పాల్గొన్నారు.బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# లబానా సంప్రదాయానికి ప్రతీకగా తీజ్ వేడుకలు









**తండాల్లో వెల్లివిరిసిన సంస్కృతి.. కోలాటాలు, దాండియాతో సందడి**

**తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు.. పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థనలు**

**గాంధారి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి)** లబానా సమాజ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని లబానా తండాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ వేడుకలతో తండాల్లో పండుగ శోభ సంతరించుకుంది. యువతులు, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనగా.. యువతీ యువకుల కోలాటాలు, దాండియా నృత్యాలతో తండాలు సందడిగా మారాయి.తీజ్ పండుగలో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేకంగా తయారు చేసిన తట్టల్లో గోధుమలను విత్తి, వాటిని భక్తిశ్రద్ధలతో పెంచుతారు. తొమ్మిదో రోజు ఉదయం పెళ్లికాని యువతులు, కన్యలు ఉపవాసం ఉండి నల్ల రేగడి మట్టి, పుల్లలతో తీజ్ విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలు పూర్తయిన అనంతరం సీర, రోటీ, గోధుమ మొలకలతో నైవేద్యం సమర్పించి ఉపవాసాన్ని విరమిస్తారు.పండుగ సందర్భంగా తీజ్ విగ్రహాల చుట్టూ యువతీ యువకులు కోలాటాలు, దాండియా నృత్యాలు చేస్తూ సంప్రదాయ పాటలు పాడారు. దీంతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మరుసటి రోజు ఉదయం తీజ్ విగ్రహాలను జలమయం చేసి, పెళ్లికాని యువతులు గోధుమ మొలకలను తండాలోని ప్రతి ఇంటి ముందు ఉంచి పెద్దల ఆశీస్సులు పొందుతారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు కళకళలాడాలని, పశుసంపద వృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తీజ్ పండుగ ద్వారా తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను లబానా సమాజం కొనసాగిస్తోంది.లబానా సంప్రదాయంలో పెళ్లికాని యువతుల ఇళ్లలోనే కాకుండా.. ఆ ఏడాది వివాహమైన నూతన వధువుల ఇళ్లలోనూ తీజ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. వివాహం అనంతరం నూతన వధువు పాల్గొనే చివరి తీజ్ వేడుక కావడంతో బంధుమిత్రులను ఆహ్వానించి ఘనంగా నిర్వహిస్తారు.ఈ వేడుకల్లో శాకాహార వంటకాలకే ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. సీర, రోటీ తదితర సంప్రదాయ వంటకాలను తయారు చేసి బంధుమిత్రులు, అతిథులకు విందు ఏర్పాటు చేస్తారు. మాంసాహారానికి దూరంగా నిష్టానియమాలతో తీజ్ పండుగను నిర్వహించడం లబానా సమాజ ప్రత్యేకతగా నిలుస్తోంది.

# పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి





**రాఘవపూర్‌లో ఎస్సీ--ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు**

**అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు**

**కామారెడ్డి టౌన్ ఆగస్టు 31 ప్రజా జ్యోతి** పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో గ్రామ ప్రజలకు చట్టపరమైన హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, ఎస్సీ--ఎస్టీలపై వివక్షకు వ్యతిరేకంగా ఉన్న చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను కూడా గౌరవించాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలపై వివక్ష, వేధింపులు, అన్యాయం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. సామాజిక సమానత్వం, సోదరభావం, చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామస్థాయిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చట్టాలపై మరింత స్పష్టత కలుగుతుందని పేర్కొన్నారు.

సదస్సులో గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల్, ఉప సర్పంచ్ నరేష్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, జీపీఓ రవి, పోలీస్ ఎస్ఐ బాల్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ శాఖకు చెందిన అధికారులు, ఆర్ఐ రాజేష్, మౌనిక, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే హరిజనవాడకు చెందిన గ్రామ ప్రజలు, రాఘవపూర్ తండా ప్రజలు సైతం కార్యక్రమంలో పాల్గొని ఎస్సీ--ఎస్టీ చట్టాలపై అవగాహన పొందారు.

రాఘవపూర్ తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఇదే సందర్భంగా రాఘవపూర్ గ్రామంతో పాటు రాఘవపూర్ తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హత కలిగిన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల్, ఉప సర్పంచ్ నరేష్, జీపీఓ రవి, రేషన్ డీలర్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, రాఘవపూర్ తండా ప్రజలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**సామాజిక సమానత్వమే లక్ష్యం**

పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం గ్రామస్థుల్లో చట్టాలపై అవగాహన పెంచేందుకు దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేస్తే సామాజిక వివక్షకు అడ్డుకట్ట వేసి సమానత్వాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తమ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# క్యాసంపల్లి తండాలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ముగ్గు

**భూగర్భ జలాల పరిరక్షణకు గ్రామస్థుల ముందడుగు**

**-- వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ నీటి అవసరాలకు భరోసా**

**కామారెడ్డి టౌన్, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి)** వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంపొందించేందుకు కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండా గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టనున్న ప్రదేశాల్లో ముగ్గు పోసి పనులకు గుర్తులు ఏర్పాటు చేశారు. భూగర్భ జలాల పరిరక్షణతో పాటు భవిష్యత్‌లో నీటి కొరతను అధిగమించేందుకు గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు గ్రామపంచాయతీ పాలకవర్గం పేర్కొంది.

వర్షపు నీటిని ఒడిసిపట్టడమే లక్ష్యం

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీటిని సాధ్యమైనంత ఎక్కువగా భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో వర్షపు నీరు కాలువల ద్వారా బయటకు వెళ్లిపోకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి చేరేలా చర్యలు చేపట్టడం వల్ల బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు.

ఇంకుడు గుంతలు చిన్నపాటి నిర్మాణాలే అయినప్పటికీ నీటి సంరక్షణలో వాటి పాత్ర ఎంతో కీలకమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర అనువైన ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి పంపించవచ్చు. దీనివల్ల భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచేందుకు దోహదపడుతుందని తెలిపారు.



భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు

భూగర్భ జలాలు తగ్గిపోతున్న పరిస్థితుల్లో వర్షపు నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామపంచాయతీ ప్రతినిధులు అన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూమిలోకి ఇంకించడం, చెట్ల పెంపకం వంటి చర్యలను సమష్టిగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థులు కూడా ఇంకుడు గుంతల నిర్మాణానికి సహకరించాలని, తమ ఇళ్ల పరిసరాల్లో నీరు వృథాగా బయటకు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

క్యాసంపల్లి తండాలో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అవకాశం ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీనివాస్, గ్రామపంచాయతీ సెక్రెటరీ మాధవీలత, టీఏ మదన్‌సింగ్‌తో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీర్కూర్ ప్రజావాణిలో 9 ఫిర్యాదులు




**బీర్కూర్, ప్రజాజ్యోతి ఆగస్టు 31:** బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి 9 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్యకు నూతన పాలకవర్గం



**గాంధారి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి)** గాంధారి మండల మహిళా సమాఖ్య 20వ వార్షిక మహాసభను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షురాలిగా పోతంగల్ కలాన్ గ్రామానికి చెందిన జి. అంబాలక్ష్మి, కార్యదర్శిగా సితాయపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి సాయవ్వ, కోశాధికారిగా ముదోలి గ్రామంలోని ఆంజనేయ గ్రామ సంఘానికి చెందిన జి. గంగమణి ఎన్నికయ్యారు.మహాసభకు మండల పరిధిలోని 50 గ్రామ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా సమైక్య తరపున ఎన్నికల అబ్జర్వర్‌గా జిల్లా సమైక్య కోశాధికారి ఎస్. లక్ష్మి హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఆర్ఎం కిరణ్, మండల సమాఖ్య ఏపీఎం ప్రసన్నకుమార్, సీసీలు గొర్రె రాములు, కపిల, రమేష్, కాశీనాథ్ గౌడ్, రాథోడ్ రమేష్, కుమ్మరి రాజయ్య, సౌజన్య, మండల సమాఖ్య అకౌంటెంట్ కే. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను అభినందించారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ, మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ఎల్లారెడ్డి ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు



**ఎల్లారెడ్డి, ఆగస్టు -31(ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డి మండల స్థాయిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎంపీడీవో, నోడల్ అధికారి తాహెరా బేగం తెలిపారు. ఫిర్యాదుల్లో రెండు మున్సిపల్ శాఖకు, ఒకటి రెవెన్యూ శాఖకు, మరొకటి అటవీ శాఖకు సంబంధించినవని ఆమె పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# మండల కేంద్రంలో ఫుట్బాల్ టోర్నమెంట్ టోర్నమెంట్



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 30 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ప్రీమియర్ లీగ్ ఫుట్బాల్ టోర్నమెంట్ లో ఆరు జట్లు పార్టిసిపేషన్ పోటీ చేయగా ఇందులో హోరాహోరీగా పోటాపోటీగా క్రీడాకారులు చాలెంజ్ గా తీసుకొని ఆటలాడుతూ చివరగా విజయోత్సవంగా 5:30 బ్యాచ్ గొప్ప ఘన విజయోత్సవాన్ని సాధించడం జరిగింది. ఈ యొక్క టీం ఆర్గనైజింగ్ వారు చాలా సంతోషపడుతూ వాళ్ళ క్రీడాకారులతో సంతోషాన్ని అనుభూతిని పంచుకున్నారు. అదేవిధంగా గ్రామంలో 5:30 బ్యాచ్ మునుముందు ఇంకా అనేక రంగాలలో ముందుకు వెళ్తుందని అంతేకాకుండా స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు కూడా చేయడం జరుగుతుందని, క్రీడాకారులకు అదేవిధంగా విద్యను అభ్యసించే విద్యార్థులకు అన్ని రంగాలుగా సహాయ సహకారాలు అందించడానికి 5:30 బ్యాచ్ ముందుంటుందని ఆ సంస్థ నిర్వాహకులు గుర్గకుంట స్వామి తెలిపారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**వనమహోత్సవం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్**

**ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు**



**కామారెడ్డి టౌన్, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో వనమహోత్సవం కార్యక్రమంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమైన అంశమని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి పెరిగే వరకు సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో, రహదారుల వెంట, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే నేటి నుంచే పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

వనమహోత్సవం కార్యక్రమం అనంతరం 13వ వార్డులో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డు ద్వారా పేద, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆహార భద్రతా ప్రయోజనాలు అందుతున్నాయని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా కృషి చేస్తామని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**విద్యార్థుల భాగస్వామ్యంతో సందడిగా వనమహోత్సవం**

13వ వార్డులో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆశా కార్యకర్తలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పచ్చదనం వల్ల కలిగే ప్రయోజనాలు, మొక్కల సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను స్థానికులు తీసుకోవాలని అధికారులు సూచించారు. వార్డులో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ హన్మాంతరావు, కౌన్సిలర్లు లలిత చిట్టిబాబు, అంజాద్, వాజీద్, బబ్లు, జావీద్, సిద్దిక్, సత్యం, భాస్కర్ గౌడ్, మున్సిపల్ అధికారులు అక్తర్, వార్డు ఆఫీసర్ వినయ్, ప్రభుత్వ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు, ఆశా వర్కర్లు, వార్డు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## నర్సు శిరీష హత్య కేసు ఛేధించిన పోలీసులు

**హైదరాబాద్ :** నగరంలోని పహాడిషరీఫ్ పీఎస్ పరిధిలో జరిగిన నర్సు హత్య కేసును పోలీసులు ఛేదించారు. అత్యాచారం చేయడానికి నిందితుడు ప్రయత్నించడంతో ఆమె ప్రతిఘటించింది. ఈ క్రమంలో ఆమె కేకలు వేయకుంగా గొంతు నొక్కడంతో ప్రాణాలు కోల్పోయిందని పోలీసులు తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష అనే 21 ఏళ్ల యువతి తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. తండ్రి కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో, తల్లి రామలక్ష్మి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. చదువు పూర్తయ్యాక నర్సుగా చేరు చేరిన శిరీష, శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని తాను ఉంటున్న రూమ్‌కు వెళ్లిపోయింది. శనివారం మధ్యాహ్నం రూమ్‌మేట్ డ్యూటీ ముగించుకుని వచ్చి చూడగా, శిరీష తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. నిరుపేద కుటుంబంలో తల్లికి తోడుగా నిలిచి బాధ్యతలు చూస్తున్న సమయంలో ఆమె చనిపోవడంతో చౌటిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.రంగంలోకి దిగిన మహేశ్వరం పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించిన తరువాత కొందరు అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. బిహార్ రాష్ట్రం బెగుసరాయ్ జిల్లాకు చెందిన ఎండి సనావుల్లా ఖాన్ (34) తాను తప్పు చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. అతను తుక్కుగూడలోని శ్రీ భాగ్యలక్ష్మి బైక్ మెకానిక్ షాప్‌లో పనిచేస్తాడని కొందరు చెబుతుండగా, రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఒంటరిగా ఉన్న సమయం చూసి నర్సు శిరీష ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు సనావుల్లా ఖాన్ ఆమెపై అత్యాచారం చేయడానికి యత్నించాడు. యువతి ప్రతిఘటించడంతో అరవకుండా గొంతు గట్టిగా నొక్కడంతో ఆమె చనిపోయినట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు. శిరీష మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఈ దారుణ ఘటనపై ఉస్మానియా మార్చురీ వద్ద తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. గతంలో బాధితురాలు దిశ కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన తరహాలోనే నిందితుడు సనావుల్లా ఖాన్‌ను కూడా ఎన్‌కౌంటర్ చేసి శిరీష కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని బీజేపీ నాయకులు, మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఇద్దరితో మహిళ ఎఫైర్..
## కారుతో ఢీకొట్టి ఓ వ్యక్తి దారుణ హత్య..

**ఖమ్మం :** ఒకే మహిళతో ఇద్దరు వ్యక్తులు అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యవహారం తీవ్ర విషాదానికి కారణమైంది. కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. మౌలానా (42), ఇస్మాయిల్ అనే ఇద్దరు వ్యక్తులు ఒకే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఆమె జోలికి నువ్వు రావొద్దు అంటే నువ్వే ఆమెను వదిలెయ్ అంటూ వారిద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి.

# ప్రజావాణికి కొందరు అధికారుల డుమ్మా!







**11 గంటలు దాటినా హాజరుకాని అధికారులు..**

**ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజల్లో అసంతృప్తి**

**కామారెడ్డి టౌన్ ఆగస్టు 31 ప్రజా జ్యోతి** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తమ సమస్యలను పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రజలు ప్రజావాణికి తరలివచ్చారు.

ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం మూడు ఫిర్యాదులు అందినట్లు కామారెడ్డి మండల ఎంపీడీవో హేబ్సిబా రాణి తెలిపారు. ఇందులో రెండు ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు, ఒక ఫిర్యాదు మున్సిపల్ శాఖకు సంబంధించినవిగా ఉన్నాయని వెల్లడించారు. ప్రజలు అందించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై ఫిర్యాదులు అందించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం, ఫిర్యాదులను స్వీకరించడం, సంబంధిత శాఖల ద్వారా పరిష్కారం చూపించడం ప్రజావాణి ప్రధాన ఉద్దేశం.

అయితే కార్యక్రమం నిర్వహించే సమయంలో అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా, 11 గంటలు దాటినా కొందరు అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాకపోవడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

**సమయపాలన పాటించాలి**

ప్రజావాణి వంటి కార్యక్రమాలకు అధికారులు తప్పనిసరిగా సమయానికి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజలకు నేరుగా సేవలు అందించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు విధులకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోతే వారు మరోసారి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

ప్రజావాణి కార్యక్రమం కేవలం ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే వేదికగా మారాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి వారం నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**వివిధ శాఖల అధికారులు పాల్గొనగా..**

కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు అందగా, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హేబ్సిబా రాణి తెలిపారు.

ప్రజావాణికి అధికారులు సమయానికి హాజరై ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యాలకు ప్రాధాన్యం**

**చిన్న మల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమం**




**కామారెడ్డి టౌన్ ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది. గ్రామ సర్పంచ్ బీమాయల లక్ష్మి రాజు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల్లో భాగంగా యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ బీమాయల లక్ష్మి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి అవసరాలకు అనుగుణంగా వివిధ సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సమయపాలన, విద్యపై ఆసక్తిని అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించడం వల్ల పాఠశాలలో అందరూ సమానత్వ భావనతో ఉండేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. యూనిఫామ్‌లను శుభ్రంగా, చక్కగా ధరించి ప్రతిరోజూ పాఠశాలకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ పాఠశాలకు క్రమం తప్పకుండా పంపించాలని కోరారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు తభస్సం మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విద్యా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తులో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు.

యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమంతో విద్యార్థుల్లో ఉత్సాహం

## 40కి పైగా స్టేషన్ల పునర్నిర్మాణంతో
## తెలంగాణ రైల్వేల దశ మారుతుంది: కిషన్ రెడ్డి

**హైదరాబాద్ :** రూ.27 కోట్ల వ్యయంతో వేగంగా జరుగుతున్న వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. తెలంగాణవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా వికారాబాద్, తాండూర్, నాంపల్లి, సికింద్రాబాద్, చర్లపల్లి, మౌలాలి వంటి దాదాపు 40కి పైగా రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.వికారాబాద్ ప్రాంత వాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎస్కలేటర్, 2 లిఫ్టులు, నూతన వెయిటింగ్ హాల్, విఐపి లాంజ్, అధునాతన పార్కింగ్ వసతులతో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో పాటు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో రైల్వే రంగానికి భారీగా నిధులు కేటాయిస్తూ అనేక వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ట్రాక్‌ల రెట్టింపు, మూడో, నాలుగో మార్గాల తవ్వకం పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 100 శాతం రైల్వే విద్యుదీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. రైలు ప్రయాణ రక్షణ కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన 'కవచ్', 'కవచ్ 2.0' (ఐంఎంఅఊ 2.0) భద్రతా పరిజ్ఞానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. హైదరాబాద్ నుంచి ప్రస్తుతం 5 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తూ వేగవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తున్నాయని తెలిపారు.కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే తయారీ కేంద్రం (రైల్ తయారీ యూనిట్) పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా దీని ప్రారంభోత్సవం జరుగుతుందని కిషన్ రెడ్డి వెల్లడించారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను బెంగళూరు, చెన్నై, పూణే నగరాలతో అనుసంధానించే బుల్లెట్ రైలు సర్వీసులు రానున్నాయని పేర్కొన్నారు.ఇవి ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలను నివారిస్తాయని స్పష్టం చేశారు. తెలంగాణలో ముఖ్యమైన రైల్వే జంక్షన్లలో వికారాబాద్ ఒకటని, రైల్వే అభివృద్ధితో పాటు వికారాబాద్ జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను

## దళితులపై వివక్షత ఎందుకు...

**చట్టాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి...**

**కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండలం బెలుంగుహల ఆవరణలో ఉన్న గెస్ట్ హౌస్ లో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో దళితుల పట్ల ఎందుకు వివక్షత చూపిస్తున్నారని ఆయన అన్నారు. దేశంలో ఎక్కడైనా దళితుల పట్ల వివక్షత లేకుండా చూడాలని ప్రభుత్వం చట్టాలను ఏర్పాటు చేసింది. ఈ చట్టాలపై గ్రామాలలో ఉన్న ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచ్ నుండి మొదలుకొని రాష్ట్రపతి వరకు దళితుల పట్ల వివక్షత చూపిస్తున్నారని దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. ఈనెల 11న విజయవాడలో జరిగే బహిరంగ సభకు మాదిగ పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన వారికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, బాల కంబయ్య, బాల ఓబులేసు, ఓబయ్య, సిద్దయ్య, నరసింహులు,పెద్దయ్య, నాగాంజనేయులు ఇంకా తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## కానిస్టేబుల్ బలవన్మరణం...

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రేమ విఫలమవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.వివరాల్లోకి వెళితే.. తిరుమలనగర్‌లో నివసించే నిభాష్ (25) పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా అతను ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని భావించిన నిభాష్‌కు యువతి కుటుంబ సభ్యుల నుంచి నిరాకరణ ఎదురైంది. వారు వారి పెళ్లికి అంగీకరించకపోవడంతో నిభాష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.ఈ క్రమంలోనే రాత్రి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే, ఆత్మహత్య చేసుకునే ముందు ఈ విషయాన్ని తన స్నేహితులకు వాట్సాప్ ద్వారా తెలియజేశాడు. ఉదయం అతని స్నేహితులు ఇంటికి వచ్చి చూడగా, నిభాష్ విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రేమ వ్యవహారమే ఈ ఆత్మహత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా

# బాలయ్య కొత్త సినిమాకు రెండక్షరాల టైటిల్ ఫిక్స్ సెప్టెంబర్ 6న భారీ ప్రకటన




నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'వీరసింహారెడ్డి' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన ఈ కాంబినేషన్ మరోసారి చేతులు కలపడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో మొదటి నుంచే ఉంది. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లిమ్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.తాజాగా ఈ మూవీకి సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా అధికారిక టైటిల్‌తో పాటు థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను సెప్టెంబర్ 6న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దీంతో నందమూరి అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. కోసం ఇప్పటికే రెండు పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. (దాదా) అనే టైటిల్స్‌లో ఒకదాన్ని సినిమాకు ఖరారు చేసే అవకాశం ఉందని టాక్ వచ్చింది.బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు, గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్ ఎలిమెంట్స్‌కు ఈ రెండు టైటిల్స్ బాగా సెట్ అవుతాయని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం 'దాదా' టైటిల్‌నే దాదాపుగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది.అయితే దీనిపై అధికారిక క్లారిటీ మాత్రం సెప్టెంబర్ 6న రానుంది. ఆ రోజే టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించనుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. గోపీచంద్ మలినేని ఈసారి బాలయ్యను సరికొత్త యాక్షన్ అవతార్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తోంది.




## శ్రీవిష్ణు నుంచి మరో కొత్త సినిమా.. కామెడీకి దూరంగా ఎమోషనల్ కథతో వస్తున్న యంగ్ హీరో!

వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యంగ్ హీరో శ్రీవిష్ణు మరో కొత్త సినిమాను ప్రకటించారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు.. ఈసారి మాత్రం సరికొత్త ఎమోషనల్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హారికా హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత చినబాబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ గ్లింప్స్ విడుదల చేశారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. చిన్నప్పటి నుంచి ఎన్నో కలలు కనే ఓ సాధారణ మధ్యతరగతి అబ్బాయి.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, బాధ్యతల కారణంగా తన ఆశలను పక్కన పెట్టి సాధారణ జీవితాన్ని కొనసాగించే పరిస్థితిని ఇందులో చూపించినట్లు తెలుస్తోంది. మంచి కాలేజీలో చదవాలనే కోరిక ఉన్నా కుటుంబ పరిస్థితుల కారణంగా సాధారణ కాలేజీలో చదవడం.. జీవితంలో ఎన్నో సాధించాలని ఆశించినా కుటుంబ బాధ్యతల కోసం ఉద్యోగం చేయడం.. ఇలా ఎంతోమంది మిడిల్ క్లాస్ యువకుల జీవితాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఈ సినిమాలో చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. శ్రీవిష్ణు సినిమాలంటే సాధారణంగా కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు డిఫరెంట్ కాన్సెప్ట్‌లు గుర్తుకొస్తాయి.



# 'వేట' ఓ గ్రామీణ కథ

అశోక్ కోటిపల్లి దర్శకత్వంలో సందీప్ సరోజ్, సాత్విక జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'వేట'. ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమం? సోమవారం(ఆగస్టు 31) ఘనంగా నిర్వహించారు. కొణిదెల నాగబాబు, కేఎస్ రవి కుమార్, వీఎన్ ఆదిత్య, మెహర్ రమేష్, సాయి రాజేష్, ఎస్‌కేఎన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సందీప్ మాట్లాడుతూ.. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో అందరికీ పరిచయం అయ్యాను. ఈ కొత్త సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన నాగబాబుకి ధన్యవాదాలు. 'వేట' అనేది చిరంజీవి సినిమా టైటిల్. ఇది ఓ గ్రామీణ కథ. ఈ సినిమాని అందరూ సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. కాగా ఎస్‌ఆర్‌డీ ప్రొడక్షన్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ సంగీతం అందిస్తున్నారు.




## పిల్లితో మొదలైన మిస్టరీ.. 'హతః' టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి పెంచిన కిరణ్ అబ్బవరం!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. "×ర్ ష్ట్రవ ఖ్ఞ ఖశ్రీఅజవ శీతీ.." అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది.

# ఒక్క కథ కూడా ఎక్జయిటింగ్‌గా అనిపించలేదు.. రోమాంచకం బ్యూటీ అనంతిక సనిల్ కుమార్



టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో వస్తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ రోమాంచకం. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో అనంతిక సనిల్ కుమార్, సుమంత్ ప్రభాస్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ గురువారం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా అనంతిక సనిల్ కుమార్ ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది.

రోమాంచకం సినిమా గురించి మాట్లాడుతూ.. 8 వసంతాలు తర్వాత నేను చాలా కథలు విన్నా. కానీ వాటిలో ఏవీ కూడా ఎక్జయిటింగ్‌గా అనిపించలేదు. అప్పుడే రోమాంచకం స్టోరీ నా దగ్గరకు వచ్చింది. ఇలాంటి స్క్రిప్ట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నా. ఈ సినిమాలో సాదాసీదాగా కనిపించే అమ్మాయిగా నటించా. యూత్‌కు రోమాంచకం కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో ప్రేమతోపాటు కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయంది.

నేటి యువత జీవితాల్లో చోటుచేసుకుంటున్న సమకాలీన అంశాలను రోమాంచకరం ప్రతిబింబిస్తుంది. మా సినిమాను ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా వీక్షించవచ్చు. నాతో పోలిస్తే సుమంత్ ప్రభాస్ ఈ మూవీ కోసం చాలా వర్క్ షాప్స్‌లో పాల్గొన్నారు. ఆయన పాత్ర ఎంతో ఉత్సాహభరితంగా ఉంటుంది. మా మధ్య డైలాగ్స్ చాలా సహజంగా ఎక్కడా సాగదీసినట్టుగా అనిపించకుండా సాగుతాయని చెప్పుకొచ్చింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967